క్లుప్తంగా

పాఠశాలకు టేబుల్ వితరణ

పలమనేరు: పట్టణంలోని కాకాతోపు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలకు పట్టణానికి చెందిన దాత జావీద్ రూ.15వేలు విలువచేసే ఉడ్ టేబుల్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మునాఫ్ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దాతను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల కోసం దాతలు ముందుకురావాలని ఆయన కోరారు.

బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులు, సీఐ

పుంగనూరు: పుంగనూరు అర్బన్ సీఐగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జయరాంను చిత్తూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతిలో పనిచేస్తున్న శ్రీనివాసులును ఇక్కడ నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే!


పాతపేట వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం రహదారి చినుకు పడితే చిత్తడిగా మారిపోతోంది. మండల కేంద్రం నుంచి కడపనత్తం గ్రామానికి 5 కిలోమీటర్లు ప్రయాణించాలంటే నానా తంటాలు పడాల్సిందే. ఈమార్గంలో నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. పాతూరునత్తం, పాతపేట, కుప్పనపల్లె గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి వస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశిబిరానికి మంచి స్పందన


వైద్యశిబిరంలో డా.అంజుమున్నీషా

పలమనేరు: పట్టణంలోని ఉయ్ కేర్ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఐవీఎఫ్ ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. సంతానం లేని దంపతులు వందమంది పైగా శిబిరానికి వచ్చి ఉచితంగా స్కానింగ్ చేసుకొని అవసరమైన పరీక్షలను చేసుకున్నారు. ఐవీఎఫ్ స్పెషలిస్ట్‌లు డా.అంజుమున్నీషా, డా. తనూజ పిల్లలు లేని మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించారు. డా.ఖలీల్‌ఉల్లా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'పురాణం' మృతి తీరని లోటు



సంతాపం తెలుపుతున్న రచయితలు, ఇన్‌సెట్లో పురాణం (ఫైల్)

పలమనేరు: ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ జర్నలిస్ట్ పురాణం త్యాగమూర్తి శర్మ మృతి సాహితీ లోకానికి తీరని లోటని పలమనేరు రచయితల సంఘవ గౌరవాధ్యక్షుడు మాధవ్ తెలిపారు. పురాణం త్యాగమూర్తిశర్మ అనారోగ్యంతో చికిత్సపొందుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో శనివారం మృతిచెందారు. ఈ సందర్భంగా స్థానిక రచయితలు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయనకు నివాళుర్పించారు. మాధవ్ మాట్లాడుతూ మదనపల్లి రచయితల సంఘ గౌరవాధ్యక్షుడిగా విధుల నిర్వహిస్తూ సాహితీలోకానికి ఆయన విశేష సేవలు చేశారన్నారు. ఆయన తెలుగు, ఆంగ్ల భాషల్లో రాసిన ఎన్నో పుస్తకాలు సమాజానికి మార్గనిర్దేశంగా మారాయన్నారు. కవులు కుమారస్వామిరెడ్డి, తులసీనాథంనాయుడు, యుగంధర్, గిరిధర్ మూర్తి, సిద్ధార్థ, గండికోట వారిజ, లైబ్రేరియన్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్‌లో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

మట్టి గణపయ్యలే మేలు!

- పీఓపీతో పర్యావరణానికి ముప్పు
- మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- ఆరోగ్యకరమైన పర్యావరణానికి సామాజిక బాధ్యత
- చైతన్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు


మట్టి వినాయకుని ప్రతిమలు

పలమనేరు: వినాయకచవితి సందర్భంగా ఏటా విగ్రహాల నిమజ్జనంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతూనే ఉంది. పీఓపీ అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయి. ఇటీవల ఓపీ విగ్రహాల నిమజ్జనంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో కొంత మార్పు వస్తోంది. వినాయకచవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేసేశారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ఏర్పడే పర్యావరణ సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ప్రజలపై ఉంది.

పీఓపీతో పొంచి ఉన్న ముప్పు

ఇవి భూమిలో త్వరగా కరగక నీటిలో జిప్సంగా మారి కాలుష్యానికి కారణమై నీటిలో ప్రాణ వాయువు స్థాయి తగ్గి జలచరాలకు ఇబ్బందిని కలిగిస్తాయి. భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటాయి. దీంతో నీరు ఆవిరై వృథా అవుతుంది. దీనికితోడు ఇవి త్వరగా కరగవు. నీటి కాఠిన్యాన్ని పెంచి నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది నీటిలో చేరి నీటి ఆమ్లత్వాన్ని, టీడీఎస్(టోటల్ డిస్సాల్వ్‌డ్ సాలిడ్స్)శాతాన్ని పెంచుతుంది. పీఓపీతోపాటు ఉపయోగించే రంగులతో హానికరమైన పాదరసం, కాడ్మియం, సీసం చేరిన నీటిని తాగడంతో కిడ్నీలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. నీటిలో కలిసే థర్మోకోల్, ప్లాస్టిక్ పువ్వులు, వస్త్రాలతో నీటి కాలుష్యం ఎక్కువై అలాంటి అపరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల పశువులకు రోగాలతోపాటు చర్మ వ్యాధులు సోకే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) వలన జరిగే అనర్థాలపై పలు స్వచ్ఛంద సంస్థలైన పలమనేరు పరిరక్షణ సమితి, రసజ్ఞుల సమాఖ్య, జనవిజ్ఞానవేదిక లాంటి సంస్థలు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాయి. దీనికి తోడు పాఠశాలలో మట్టి వినాయకులు ఆవశ్యతను ఉపాధ్యాయులు పిల్లలకు వివరించాలి. సోషల్ మీడియాలోనూ పలువురు వీఐపీలు మట్టి ప్రతిమలనే వాడుదామంటూ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. దీనికి తోడు సంబంధిత కుమ్మర, శాలివాహన సంఘాలు మట్టి బొమ్మల ఆవస్యతను తెలియజేస్తున్నాయి. దీంతో ప్రజలు మట్టి వినాయకులు కొనుగోళ్లకు ఆసక్తిని చూపుతారని ఆశిద్దాం.

మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ

జరుగుతున్న అనర్థాలపై ప్రజలు ఆలోచించి, ఆచరించి, అందరం కలసి రాబోవు తరాలకు సుందరమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని ఇవ్వాల్సి ఉంది. పీఓపీ అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఇదో సామాజిక బాధ్యతగా మట్టి వినాయకుని విగ్రహాలను చవితి సంబరాలను జరుపుకొనేందుకు ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు. జిల్లాలో వినాయక చవితిని విశిష్టమైన మట్టి ప్రతిమలతో ఊరూ, వాడా, ఇళ్లలో ఉంచి పూజలు చేయాలని కోరుకుందాం.

పీఓపీ అంటే..


ప్రమాదకర పీఓపీ విగ్రహాలు

జిప్సంను 120 నుంచి 180 డిగ్రీల వరకు వేడిచేస్తే పీఓపీ తయారవుతుంది. దీని రసాయన నామం కాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్. ఇది ఓ తెల్లటి నిర్మాణపదార్థం. ఇది 25 సెంటీగ్రేడ్ వద్ద నీటిలో ద్రావణీయత 0.3గ్రాములుగా ఉండి నీటిలో ముంచగానే వెంటనే ఓ గట్టి పదార్థంగా మారుతుంది. 18వ శతాబ్దంలో ప్యారిస్ చుట్టూ లభ్యమయ్యే జిప్సంను భారీ స్థాయిలో మైనింగ్ చేసి దీన్ని తయారుచేయడంతో అప్పటి నుంచి దీనికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనే పేరొచ్చింది. వాస్తవంగా దీన్ని విరిగిన ఎముకలు, కీళ్ల అచ్చులకు ఉపయోగిస్తారు. దీంతోపాటు ఇళ్ల పైకప్పులు, అలంకరణలు, నల్లబల్ల తయారు చేస్తారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడుకుందాం



వీటి ధర చాలా తక్కువగా ఉంటుంది. ఇవి నీటిలో సులభంగా కరిగి కాలుష్యాన్ని కలిగించవు. చెరువులోని బంకమట్టిని తీయడం వలన నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భజలాలు పెరుగుతాయి. వీటిని తయారు చేసే పని వాళ్లకు ఆర్థిక భరోసాతో పాటు వారిని ప్రోత్సహించినట్లే. కాబట్టి మట్టి వినాయకులను పెట్టి పర్యావరణాన్ని కాపాడుకుందాం. ఇది మనందరి బాధ్యతగా భావిద్దాం.

–రమణ, జిల్లా సైన్స్ అధికారి

పీవోపీకి వ్యతిరేకంగా పోరాటం



పర్యావరణంతో బాటు పకృతి సమతుల్యతను కాపాడుకోవాలనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నాం. ఇప్పటికే మట్టి విగ్రహాల వాడకంపై ప్రజలకు అవగాహణ కల్పిస్తున్నాం. పీవోపీ విగ్రహాలు చూసేందుకు భారీగా కలర్స్‌తో ఉంటాయి. దీంతో పీవీపీ విగ్రహాలపై జనం మోజు పడుతున్నారు. అందుకే ప్రజల్లో అవగాహణ నింపేందుకు పీపీఎస్, రసజ్ఞుల సమాఖ్య, కుమ్మర సంఘం, పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ తదితర సంఘాలు జతకట్టి మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం.

–మిలటరీ సిద్ధయ్య, పలమనేరు

విజేత విద్యార్థులకు బహుమతులు


విజేత విద్యార్థులతో అయూబ్, షావలి

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాదాద్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, అలుమిని, దారుల్‌హుదా వారు కలసి నిర్వహించిన హర్ ఘర్ తిరంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేశారు. అధిక మార్కులు సాధించిన కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌కు రూ.5,001 ప్రథమ బహుమతి లభించింది. అలాగే తాటిమాకులపాళెంలో రోడ్డులో జ్ఞానాంబిక పాఠశాలకు రూ.3,001 రెండవ బహుమతి, జెడ్పీ బాలికల హైస్కూల్‌కు మూడో బహుమతి కింద రూ.2,001 నగదు బహుమతి అందజేశారు. సంస్థ ప్రతినిధులు అయూబ్‌అలిఖాన్, షావలి, కృష్ణప్ప, సుబేదార్ , మేజర్ రెడ్డెప్ప, షర్ఫుద్దీన్, హుదాహి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

కవయిత్రులకు సన్మానం


సన్మానం అందుకున్న కవయిత్రులు

పుంగనూరు: పట్టణంలోని కవయిత్రులను ఆదివారం బెంగళూరులో సన్మానించారు. బెంగళూరుకు చెందిన ఎండో ఏషియల్ అకాడమీ బెంగళూరులో కవి సమ్మేళనం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యశర్మ అకాడమీ, ప్రొఫెసర్ ఏకాంబరం పాల్గొని కవి సమ్మేళనంలో కవులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. పుంగనూరుకు చెందిన కవయిత్రులు స్రవంతి, గాయత్రి, రహత్ జాన్, హసీనాబేగంలను సన్మానించారు.

అపూర్వ సమ్మేళనం


సమావేశమైన విద్యార్థులు

సదుం: వారంతా చిన్ననాటి స్నేహితులు, కలసి చదువుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు 17 సంవత్సరాల తర్వాత ఆదివారం సదుంలో సమావేశం అయ్యారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది. మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నేడు కోనేటిరాయుని కల్యాణం

గంగవరం: టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నేడు పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర ఆదివారం తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణోత్సవం ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నేటి కల్యాణంలో పాల్గొనే భక్తులు ఇద్దరికి రూ.300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాలని తెలిపారు.

కోలాహలం.. స్వామివారి ఊరేగింపు


గ్రామంలో ఊరేగుతున్న ఆంజనేయస్వామి

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారిపల్లెలో కొత్తగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. దీక్షా హోమం, న్యాస హోమం, పంచామృతాభిషేకం, అన్నదానం, మహామంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి పాట కచేరి నిర్వహించారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన సోమవారం శ్రావణ పౌర్ణమి(రాఖీ పౌర్ణమి) సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతరావు తెలిపారు. ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు స్వామివారికి అభిషేకం, సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో స్వామికి సుదర్శన హోమం నిర్వహిస్తామని వివరించారు. వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు నిర్వహిస్తామని ఈఓ హనుమంతరావు పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రక్షాబంధన్


రక్షాబంధన్ వేడుకలు చేసుకుంటున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని మిట్టకుర్రపల్లెలో ఆర్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ధనంజయ్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయులందరూ అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉన్నప్పుడే రక్షణ ఉంటుందన్నారు. పిల్లలందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. తల్లితండ్రుల కలలను సాకారం చేసి పుట్టిన ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేశాన్ని, ధర్మాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు.

సోదర బంధానికి ప్రతీక రాఖీ


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కాణిపాకం: సోదర బంధానికి ప్రతీక రాఖీ.. రక్షాబంధన్ సోదర సోదరీ ప్రేమానురాగాలకు ప్రతీక. ఇంటిల్లిపాది చేసుకునే ఆత్మీయ వేడుక. మానవసంబంధాల విలువలను పెంచే దీపిక. రక్తసంబంధీకులు లేకున్నా మన కోసం అండగా నిలిచే అప్పలనే సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీలు కట్టి సోదరభావాన్ని పెపొందించుకునేందుకు రాఖీ పౌర్ణమే మంచి సందర్భం. మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదరప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయబద్ధమైన మన విలువలను ఉట్టిపట్టేలా చేస్తుంది. ఉన్మాద తత్వం, విచక్షణ వంటి వెకిలిచేష్టలు పెరిగిపోతూ మానవతావిలువలు మంటగలుస్తున్న ప్రస్తుత ఆధునికయుగంలోనూ రాఖీ పౌర్ణమి తన విశిష్టతను చాటిచెబుతూ సోదరప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. పవిత్ర శ్రావణమాస పౌర్ణమి వేళ వచ్చే ఈ పండుగకు ప్రజలు సిద్ధమవుతున్నారు. సోమవారం రాఖీ కట్టేందుకు ఆడపడుచులు పుట్టినిళ్లకు చేరుకుంటున్నారు.

సంప్రదాయ వేడుక

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కాచెల్లెల్లు రాఖీని దేవునిముందు ఉంచి పూజలు నిర్వహిస్తారు. తనకు అన్ని విధాలుగా రక్షణగా నిలవాలని కోరుకుంటూ రాఖీని సోదరునికి కట్టి నుదుట సింధూరం దిద్దుతారు. ఇదంతా సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనంగా చెబుతారు.

సమకాలీనతకు చోటు

మారుతున్న పాశ్చాత్య ధోరణులకు అనుగుణంగానే రాఖీ పండుగలోను మార్పులు సంతరించుకుంటున్నాయి. గతేడాది ఇదే తరహాలో పలువురు అక్కాచెల్లెల్లు తమ సోదరునికి హెల్మెట్ అందించడం, కరోనా సమయంలో శానిటైజర్లు, మాస్కులు, విభిన్నమైన రీతిలో కానుకలు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ఇంకా దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు ముందుగానే రాఖీని పోస్టుల్లో పంపుతున్నారు. సోదరుల సంక్షేమం, క్షేమం కోరుతూ సందేశాలనూ పంపుతున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాను వేదికగా వాడుకుంటున్నారు.

వందల డిజైన్లలో రాఖీలు

చిత్తూరులో రాఖీలు కొన్ని వందల మోడల్స్ కనిపిస్తే వాటిలో 90 శాతం చిన్నారులను దృష్టిలో పెట్టుకుని రూపొందించినవే. దీంతో సంప్రదాయ రాఖీల్లోనూ మార్పులు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో జ్యూలరీ, జూరీబుట్టి, కుందన్ రాఖీలతో పాటు స్టోన్ రాఖీలు మార్కెట్లో కనువిందుచేస్తున్నాయి. రూ.10 నుంచి రూ.500 వరకు ధర పలుకుతున్నాయి. వారం రోజుల ముందు నుంచే రాఖీ కొనుగోలు మొదలయ్యాయని గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కొంత మేర అధికంగా వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా రాఖీని పురస్కరించుకుని రాఖీ విక్రయ షాపులు సందడిగా కనిపించాయి. మహిళలు, యువతులతో రాఖీ షాపులు కిటకిటలాడాయి.

మరపురాని జ్ఞాపకం!



- గడిచిన కాలానికి సాక్ష్యం
- ఆలోచనలకు ప్రతిరూపాలే ఫొటోలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

పలమనేరు: ఫొటో ఓ మరుపురాని జ్ఞాపకం. గడిచిన కాలానికి ఓ సాక్ష్యం. కొన్ని సందర్భాలలో ఓ ఫొటో ఏమైనా చేయగలదు. సంచలనాలను సృష్టించగలదు కూడా. సృజనాత్మక ఆలోచనలకు ప్రతిరూపాలుగా నిలిచే ఫొటోలను ఎన్నటికీ పదిలమే. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల ఫొటో గ్రాఫర్స్ ఈ కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన ప్రత్యేక కథనం.

1839 నుంచే ప్రపంచ ఫొటోగ్రఫీ డే

నేడు డిజిటల్ కెమెరాల నుంచి నాటి ఫిల్మ్ కెమెరాల రోజుల్లోనూ ఫొటోలకు విపరీతమైన ప్రాముఖ్యత ఉంది. అప్పట్లో డ్యాగురే రూపొందించిన డ్యాగురేట్ విధానం నుంచి నేటికి ఫొటోగ్రఫీలో ఎన్నో మార్పులొచ్చాయి. 1839లో ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఫ్రాన్స్)లో దీనికి మూలకారణం. ఆపై ఆగస్టు 19, 1839 నుంచి ప్రపంచ ఫొటో దినోత్సవాన్ని జరుపుకోవడం మొదలైంది.

ప్రపంచస్థాయి పోటీలు సైతం మొదలు

ది వరల్డ్ ఫొటోగ్రఫీ ఆర్గనైజేషన్ (డబ్ల్యూపీఓ) ఆవిర్భావం నుంచి ఏటా ఉత్తమ ఫొటోలను ఎంపిక చేసే ప్రక్రియ మొదలైంది. పరిపక్వతగల, నైపుణ్యంగల వాటిని వృత్తిపరమైన ఫొటోగ్రాఫర్‌లు తీసివుంటే ఇందులో బహుమతులు ఇవ్వడం ప్రారంభించారు. ప్రముఖ కెమెరాల తయారీ సంస్థ సోనీ ఏటా అద్భుతమైన ఫొటోలను ఎంపిక చేసేందుకు పోటీలను సైతం నిర్వహిస్తోంది. తొలుత ఇవి కేన్స్‌లో ప్రస్తుతం(2011 నుంచి) లండన్‌లో నిర్వహిస్తున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన కోఎస్కీ ఏరా ప్రపంచ ఫొటోడే పేరిట పోటీలను నిర్వహించడం ఆనవాయితీ. 2009 నుంచి ఏటా వీటిని నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు. 2010లో 270 మంది ఫొటోగ్రాఫర్‌లతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం ప్రపంచదేశాలలో విస్తృతమైంది. మనదేశంలోనూ కొన్ని సంస్థలు పోటీలను నిర్వహిస్తున్నాయి.

గతిని మార్చే ఫొటో

కేవలం ఓ ఫొటో ఒక్కోసారి సంచలనాలకు బిందువులా మారుతుంది. గతంలో శేషాచలం అడవుల్లో తమిళ కూలీలపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేవలం ఫొటోలతో ఎంత సంచలనం రేగిందో చెప్పనవసరం లేదు. కేవలం ఓ ఫొటో బాల్యవివాహాలపై ఆలోచనలను రేకెత్తిస్తే, మరో ఫొటో పేదరికాన్ని ఎత్తి చూపుతుంది. ఇలా ప్రతి సమస్యను ఎత్తిచూపే సజీవ రూపమే ఫొటో. మన కళ్ల ముందు సంఘటనను అద్దం పట్టే దృశ్యమాలికలెన్నో. ఒక్కొక్క ఫొటోకు ఓ కథ ఉంటుంది. అందుకే ఫొటోలు ఎన్నటికీ సజీవంగానే ఉంటాయి.






కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

26న కృష్ణాష్టమి వేడుకలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లి వద్ద నిర్మించిన శ్రీకృష్ణాలయంలో ఈనెల 26న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఆదివారం పుంగనూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం, శ్రీకృష్ణాలయ కమిటీ సభ్యులు ఈసందర్భంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. 25వ తేదీ రాత్రి శ్రీకృష్ణుని ఊంజలసేవ జరపనున్నట్లు తెలిపారు. అలాగే 26న ఉదయం స్వామివారికి అభిషేకం, గోపూజ నిర్వహించి, యాదవులచే అంగరంగ వైభవంగా స్వామివారిని పట్టణంలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.